క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గండేడ్: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ అధికారి తెలిపారు. ట్రాన్స్‌కో వారు 132 కేవీ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిన్నారం, జక్లపల్లి, జిన్నారంతండా, చెల్మిల్ల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని తెలిపారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి యామరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో ఈ వానాకాలం ప్రారంభంలోనే రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి వివిధ అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తల బృందం వివరించడం జరుగుతుందని తెలిపారు.

మహిళ రక్షణకు ప్రత్యేక చర్యలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళలకు ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జస్టిస్ ఇందిర అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ బాలికల కళాశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు పనిచేసే చోట వేధింపులకు గురైతే పోష్ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే లోక్ అదాలత్‌ను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. సమావేశంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

కోయిల్‌కొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి, రాజునాయక్, వెంకటేష్, శివకుమార్‌గౌడ్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని దమాయపల్లిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులకు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్లను గ్రామ పంచాయతీ కార్యాలయంలో బోర్డు దగ్గర ప్రదర్శించారు. కార్యక్రమంలో కమిటీ స భ్యులు పద్మమ్మ, ఈదమ్మ, పంచాయతీ కార్యదర్శి రాకేష్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక వివేకానంద చౌరస్తాలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సివిల్ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణయ్య, బచ్చిరెడ్డి, భీంరెడ్డి, కృష్ణయ్యగౌడ్, రాజు, పానుగంటి నాగేశం పాల్గొన్నారు.

మహిళపై దాడి

మహమ్మదాబాద్: నాలుగేళ్ల క్రితం ఇచ్చిన అప్పును అడిగినందుకు సదరు మహిళపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. మండలంలోని ఎల్కిచెర్ల తండాకు చెందిన దేవి అదే తండాకు చెందిన వసురాంకు రూ.లక్ష అవసరం కోసం అప్పుగా ఇచ్చింది. మధ్యవర్తిగా ఉన్న వ్యక్తిని అడుగగా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో ఈనెల 5న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. దీంతో వసురాం, లక్ష్మి, నీల్యానాయక్‌లు వారితో గొడవపడి దేవిని బూతులు తిడుతూ రాయితో తలపై కొట్టగా, గాయాలై రక్తంతో తడిసిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నవాబుపేటలో సమ్మర్ క్యాంపు

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నేటి నుంచి సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నాగ్యానాయక్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ఉన్న వారికి ఉచిత శిక్షణతో పాటు స్నాక్స్ సైతం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు.

గడ్డివాముల దగ్ధం

దేవరకద్ర రూరల్: పశువుల కోసం నిల్వ చేసిన గడ్డివాముపై నిప్పు రవ్వలు పడి దగ్ధమైన సంఘటన కౌకుంట్ల మండలం, రాజోళిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గోవిందు పొలంలో మూడు ట్రాక్టర్ల గడ్డివాము నిల్వ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో నిప్పు రవ్వలు గడ్డివాముపై పడి మంటలు అంటుకున్నా యి. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు.

డంపింగ్ యార్డులో మంటలు

- నాలుగురోజులుగా వాయు కాలుష్యంతో ఇబ్బందులు
- నేటికీ పొగతో తల్లడిల్లుతున్న ప్రజలు
- సోమవారం అర్ధరాత్రి ఉవ్వెత్తున ఎగిసిన మంటలు


డంపింగ్‌యార్డు నుంచి వస్తున్న పొగ

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ప్రభుత్వ అతిథి గృహానికి సమీపంలోని డంపింగ్‌యార్డులో నాలుగు రోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. వాయుకాలుష్యంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం డంపింగ్‌యార్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాదాపు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న యార్డులో చెత్త మొత్తం అంటుకుంది. దీంతో మున్సిపాలిటీ ట్రాక్టర్ ద్వారా నీరు పోసి కొంతమేర మంటలు చల్లార్చారు. ఫైరింజన్ సహాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. చెత్తపై భాగంలో మాత్రమే మంటలు ఆరిపోయాయి. తిరిగి సోమవారం రాత్రి ఉవ్వెత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఆప్రాంతమంతా మంటలతో పట్టపగలుగా మారింది. దీంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించటంతో రాత్రి వారు పైమంటలు ఆర్పగలిగారు. లోపల అలాగే ఉండటంతో యా ర్డులో చెత్త అక్కడక్కడ అంటుకుంటూనే ఉంది. మరోవైపు ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండటంతో ని^ప్పం టుకుని నాలుగురోజులుగా అధికమైన పొగ వస్తోంది. డంపింగ్‌యార్డు సమీపంలోని జయప్రకాష్‌నగర్, చీకూరిగుడిసెలు, బండమీదిపల్లి, మున్సిపాలిటీ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి పొగ వస్తూ స్థానికులకు శ్వాస ఇబ్బందులు తలెత్తేలా చేస్తోంది. పొగతోపాటు దుర్వాసన వెదజల్లుతుండటంతో పైగ్రామాల ప్రజలు దిక్కుతోచకుండా ఉన్నారు. ప్రస్తుతం మంటలు, పొగ రాకుండా ఫైరింజన్ సహాయంతో ఆర్పివేయాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



డంపింగ్‌యార్డులో నాలుగు రోజులుగా పొగ, దుర్వాసన రావటం వల్ల పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది. డంపింగ్ యార్డు ఇక్కడి నుంచి తీసివేయాలని అనేకమార్లు అధికారులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే పూర్తి స్థాయిలో మంటలు ఆర్పి, పొగరాకుండా చూడాలి.

– నర్సింహులు యాదవ్, జేపీ నగర్, జడ్చర్ల

అదుపులోకి తెచ్చేందుకు చర్యలు

డంపింగ్‌యార్డులో ఎవరో కావాలని నిప్పుపెట్టినట్లుగా తెలుస్తోంది. మంటలు ఆర్పేందుకు ఫైరింజన్ సహాయం తీసుకున్నాం. మున్సిపాలిటీ ట్యాంకర్ల ద్వారా ఎప్పటికప్పుడు మంటలు ఆర్పుతున్నాం. ఇద్దరు సిబ్బందిని అక్కడే ఉంచి మంటలు రేగకుండా చూస్తున్నాం. భవిష్యత్‌లో సమస్యలు రాకుండా చూస్తాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

కిడ్నాప్‌కు గురైన దివ్య చౌదరిని తీసుకురావాలి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాంమోహన్

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ పట్టణంలోని శివశక్తినగర్‌కు చెందిన దళిత యువకుడు నరేష్ ప్రేమించి పెళ్లి చేసుకున్న దివ్య కిడ్నాప్‌కు గురైందని, దివ్యను తిరిగి పోలీసులు తీసుకురావాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టీఎన్జీఓ భవనంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుంధతి బంధు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్ మాట్లాడుతూ దళిత యువకుడు నరేష్, ఆంధ్రకు చెందిన దివ్యచౌదరి ఇద్దరు గత నెలలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో పెళ్లి చేసుకున్నారన్నారు. ఆ తర్వాత నరేష్ తమకు రక్షణ కల్పించాలని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడన్నారు. భార్యాభర్తలిద్దరు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారని, ఈనెల 5న ఉదయం 8 గంటల సమయంలో దివ్యను వారి కుటుంబ సభ్యులు 9 మంది కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా, ఆ సందర్భంలో ప్రతిఘటించిన నరేష్ తల్లిని బెదిరించి గొంతునులిమి తీసుకెళ్లారని చెప్పారు. ఈ ఘటనపై నరేష్ వెంటనే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కిడ్నాప్ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కిడ్నాప్ కేసు పెట్టారని, కానీ ఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా కేసులో పురోగతి లేదన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం కిడ్నాప్‌కు గురైన దివ్యను వెంటనే తీసుకొచ్చి, నరేష్ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ విజయాకాంత్, దళిత సంఘాల నాయకులు రాయికంటి రాందాస్, నర్సింహులు, సింగిరెడ్డి పరమేశ్వర్, ప్రవీణ్‌కుమార్, బ్యాగరి వెంకటస్వామి, గడ్డమీది గోపాల్, పాతూరు రమేష్, మల్లెల మాణిక్యంరాజు, తిమ్మప్ప, జుట్ల హన్మంతు, బొర్ర సురేష్, రాజగాని అశోక్, ఆది విష్ణు,పడమటి యాదగిరి,పాల్గొన్నారు.

ఖోఖో శిక్షణ తరగతులు ప్రారంభం


కోయిల్‌సాగర్‌లో మాట్లాడుతున్న కోన రాజశేఖర్

దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ -14 ఖోఖో పోటీలు మంగళవారం కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ పోటీలను జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 10 క్యాంపులు ఏర్పాటు చేయగా అందులో కోయిల్‌సాగర్ ఒకటని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల యువకులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని, ఖోఖోలో రాణించి రాష్ట్ర స్థాయికి, జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ కనకప్ప, మాజీ సర్పంచ్ వెంకటేశ్, గ్రామ నాయకులు చందుగౌడ్, మదన్, కథలయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పీయూ రెగ్యులర్ అధ్యాపకుల కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ రెగ్యులర్ అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షులుగా జైపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా ఎన్.కిషోర్, సలహాదారుగా పిండి పవన్ కుమార్, ఉపాధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి, నూర్జహాన్, చంద్రకిరణ్, కోశాధికారిగా అనురాధారెడ్డి, జాయింట్ సెక్రటరీగా రాజ్‌కుమార్, శాంతిప్రియ, మార్క్‌పోలోనీస్, కల్చరల్ సెక్రటరీగా ప్రవీణ, పాలక మండలి సభ్యులుగా కుమారస్వామి, కృష్ణయ్య, అంకం భాస్కర్, విజయలక్ష్మి, సంధ్యారాణి, మాలవి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం గోవిందమాంబ దేవి సమేత శ్రీవిరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన నిర్వహించారు. భజన పోటీలు రెండో రోజు కొనసాగాయి. సాయంత్రం స్వామి వారి రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. ఆరాధన ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనాథ వృద్ధురాలిని ఆదుకున్న 'ఫోరం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్త బస్టాండు ఆవరణలో సుమారు 15 రోజులుగా ఎలాంటి దిక్కులేకుండా పడి ఉన్న 75 ఏళ్ల అనాథ వృద్ధురాలిని డీఎం సుజాత సూచన మేరకు సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు చేరదీసి మంగళవారం జడ్చర్లలోని వృద్ధాశ్రమానికి తరలించారు. ఆమె పూర్తి వివరాలను వారు అడిగితే.. తన పేరు సత్తెమ్మ అని మహమ్మదాబాద్ మండలం షేక్‌పల్లిలోని ఓ చిన్న గుడిసెలో ఉండేదానినని తెలిపింది. తనకు ఎవరూ లేరని ఒంటరిగానే జీవిస్తున్నానని, ఇటీవల ఆ గుడిసె కాస్త కూలిపోయి తన కాలు విరిగిందని తెలిపింది. 2016 నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నట్లు వివరించింది. చివరికి ఈ బస్టాండ్‌లో తలదాచుకుంటూ, ఎవరైనా తిండి పెడితే తిని అర్ధాకలితో ఉంటున్నట్లు వాపోయింది. దీంతో వారు స్పందించి త్వరలోనే గ్రామానికి వెళ్లి గుడిసెను మరమ్మతు చేయిస్తామని అంతవరకు జడ్చర్లలోని వృద్ధాశ్రమంలో ఉండాలని చెప్పి అక్కడికి ఆటోలో పంపించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు నస్కంటి నాగభూషణం, ఎ.రాజసింహుడు, రవికుమార్, ఎన్‌జీఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడపై అడవి జంతువు దాడి

నవాబుపేట: మండలంలోని కామారం గ్రామంలో మంగళవారం గ్రామ సమీపంలో పొలం దగ్గర లేగదూడను అడవి జంతువు దాడి చేసి చంపేసింది. కామారం గ్రామానికి చెందిన రైతు రామకొండకు చెందిన దూడను చంపినట్లు అధికారులు వివరించారు. దాడి చేసింది చిరుతనా లేక హైనానా అనేది తేలాల్సి ఉండగా, అటవీ శాఖ అధికారులు మాత్రం చిరుతదాడి చేసిన ఆనవాలు కనిపించటం లేదని, దాని కోసం పరిసరాలు ప్రత్యేకంగా పరిశీలిస్తామని అటవీ శాఖ అధికారి వివరించారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



దేవరకద్ర: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ కృష్ణయ్య తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటి వరకు ఏ మేరకు ధాన్యం కొనుగోలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన రిజిస్టర్‌లను, రశీదు బుక్కులను పరిశీలించారు.

క్రీడాశిబిరాన్ని సందర్శించిన డీవైఎస్‌ఓ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని మినీస్టేడియంలో జడ్చర్ల క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిబిరాన్ని జిల్లా డీవైఎస్‌ఓ శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా పే అండ్ ప్లే పద్ధతిలో శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సతీష్, ఉమాశంకర్‌గౌడ్, ఫ్లెవైక్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, పీడీ రాములు, కోచ్ శ్రీనివాస్, బాదేపల్లి రంజిత్‌బాబు, మాజీ సర్పంచ్ ప్రణీల్‌చందర్, పీఈటీ మోయిన్, కోచ్ మహేష్ పాల్గొన్నారు.

ట్రెస్సా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) జిల్లా అధ్యక్షుడిగా సి.నర్సింగ్‌రావు (జడ్చర్ల తహసీల్దార్) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఖలీద్ ఎక్బాల్ (ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవరకద్ర), అసోసియేట్ అధ్యక్షుడిగా కలెక్టరేట్ ఏఓ శంకర్‌లను నియమించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ట్రెస్సా భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్‌ల సమక్షంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, అసోసియేట్ అధ్యక్ష పదవులకు నర్సింగ్‌రావు, ఖలీద్ ఎక్బాల్, శంకర్‌ల పేర్లను ప్రతిపాదించి ఎన్నుకున్నారు. ఈనెల 21వ తేదీన మహబూబ్‌నగర్‌లో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని జిల్లా ట్రెస్సా నాయకులు అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ డిప్యూటీ తహసీల్దార్లు దేవేందర్ కేసిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వృద్ధులకు ప్రత్యేక 'ప్రజావాణి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం ఒక సంయుక్త ప్రకటలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే కార్యక్రమంలో బాధితులు తమ గోడును అధికారుల దృష్టికి తేవచ్చన్నారు.

బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని పీయూ వైస్‌ఛాన్స్‌లర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు కవిగా, విప్లవకారుడిగా లింగాయత్ మత వ్యవస్థాపకుడిగా సమాజంలో మార్పుకోసం కృషి చేశారని, కుల రహిత సమాజం, అసమానతలు లేని వ్యవస్థ కోసం ఆయన పాటుపడడం గొప్ప విషయమన్నారు. ముఖ్య వక్తగా హాజరైన బాదిమి శివకుమార్ మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగ అవలంభిస్తున్న రాజ్యాంగాన్ని బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే అవలంబించి, మార్గదర్శిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ, సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

మెట్టుగడ్డ: రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్‌పై కార్యాలయంలో ఒక వ్యక్తి భౌతికంగా దాడి జరిపిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిరసన తెలిపారు. అందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారిపై దాడి చేసిన వ్యక్తిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్‌లు మొహమ్మద్ హమీద్, సంధ్యారాణి, నాగర్‌కర్నూల్ సబ్‌రిజిస్ట్రార్ రాజేష్, జిల్లా రిజిస్ట్రార్ ఉద్యోగులు నగేష్, క్రిష్ణవేణి, భాను, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం


మాట్లాడుతున్న డీసీసీ జనరల్ సెక్రటరీ కృష్ణయ్యయాదవ్

హన్వాడ: ప్రజాసంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డీసీసీ జనరల్ సెక్రటరీ టంకర కృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టంకరలో జైభీమ్.. జై భారత్‌యాత్ర కొనసాగింది. మండల అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన ఏ ర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లు, ఫించన్‌లు, రేషన్‌కార్డులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్, డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య, యాదవరెడ్డి, భీమన్న, అచ్చన్న పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన మున్సిపల్‌కార్మికులు


ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్య విన్నవిస్తున్న వెంకటేశ్

జడ్చర్ల టౌన్: పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దివ్యను మహబూబ్‌నగర్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి 2012–2014 సంవత్సరంలో పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులు జీతాల నుంచి కట్ అయినప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని, నష్టాలను ఆమెకు వివరించారు. ఇప్పటి వరకు 7మంది కమిషనర్లు, ఇద్దరు ఈఓలు మారినప్పటికి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, 40కి పైగా కార్మికులు మృతి చెందినా, వారికి ఎలాంటి ప్రయోజనం దక్కలేదని వివరించారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణ చేసి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో యూనియన్ జడ్చర్ల అధ్యక్షుడు మహేష్, రాష్ట్ర నాయకులు రాజమల్లు, పాలడుగు సుధాకర్, కార్యవర్గ సభ్యురాలు శివలీల ఉన్నారు.

ఘనంగా కారల్‌మార్క్స్ జయంతి


కారల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మేడే వారోత్సవాలలో భాగంగా దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్ 207వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాము లు మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చాలని అనేక మంది తత్వవేత్తలు పలు రకాలుగా వ్యాఖ్యానించారని, కానీ దాన్ని మార్చాలని చెప్పిన వ్యక్తి కారల్ మార్క్స్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిజంపై అనేక మంది ఆసక్తి చూపుతున్నారన్నారు. కొత్తగా శ్రీలంక దేశంలో కమ్యూనిజం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్, నాయకులు ఖమర్ అలీ, రాజ్ కుమార్, వర్ధగాలన్న, వెంకట్రాములు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీని అభినందించిన ముదిరాజ్ మహాసభ


ప్రెస్‌క్లబ్ కమిటీకి ఎన్నికైన ముదిరాజ్ సభ్యులను అభినందిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ గెలుపొందిన ముదిరాజ్ సభ్యులకు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ అభినందించారు. శాలువాతో నాయకుల ను సత్కరించారు. కమిటీలో ము దిరాజ్‌లకు ప్రాధాన్యత కల్పించినందుకు కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, కోశాధికారిగా యాదయ్య, ఈసీ మెంటర్లుగా ఎన్నికైన మోహన్‌దాస్, రాంకొండలను ఆయన అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులను అధిరోహించి ఉన్న త శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

దేశవ్యాప్త సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

జడ్చర్ల టౌన్: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యాదయ్య, సాయిలు, కరుణాకర్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

- సమ్మెకు సహకరించాలని కావేరమ్మపేట వైద్యురాలు దివ్యకు సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, సునీత, పద్మ, మయూరి, లక్ష్మి, మంగ, జయలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

టిప్పర్, ప్రొక్లెయిన్ పట్టివేత

చిన్నచింతకుంట: మండలం లాల్‌కోట గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగు నుంచి మంగళవారం తెల్లవారు జామున కొందరు అక్రమార్కులు జేసీబీ, టిప్పర్‌తో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికల్ మండల కేంద్రానికి చెందిన కస్తూల రాజు టిప్పర్ డ్రైవర్, చిన్నచింతకుంట మండలం లాల్‌కోట గ్రామానికి చెందిన కోటగడ్డ రాము జేసీబీ డ్రైవర్‌లను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వాహనాల డ్రైవర్లకు 30 వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ ఎల్లయ్య తెలిపారు.